జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
బుధవారం
27-05-2026
సంపుటి 1 సంచిక 184
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195

**విలేకరులు కావలెను**

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



## మహిళా సంఘాలకు
# కార్పొరేట్ స్థాయి బలం

### కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయాలు: సీఎం రేవంత్


**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు భారీ స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించనున్న 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు వ్యాపార రంగంలో మరింతగా రాణించేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సంస్థల స్థాయిలో,ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. తొలి విడతగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గ కేంద్రాల్లో అవసరమైన స్థలాలను గుర్తించి మహిళా సంఘాలకు స్వల్ప అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, సూపర్ బజార్ల కోసం అవసరమైన భూములను గుర్తించడంపై దృష్టి సారించాలని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రారంభ నిధులు అందిస్తుందని,మహిళలు కూడా భాగస్వామ్య పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తామని

..మిగతా 4వ పేజీలో →

# భార్యలు ఇంట్లో పనిమనుషులు కాదు

### ముంబై హైకోర్టు సంచలన తీర్పు





**దశ, ముంబై:** ముంబై హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు భార్యాభర్తల బాధ్యతలు, వైవాహిక సంబంధాలపై కొత్త చర్చకు దారితీసింది. భార్య ఇంట్లో వంట చేయలేదని, ఇంటి పనులు సరిగ్గా చేయడం లేదని ఆమెకు విడాకులు ఇవ్వడం సాధ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. వివాహం అనేది ఇద్దరు సమాన వ్యక్తుల మధ్య భాగస్వామ్యం మాత్రమే తప్ప, అది ఒక సర్వీస్ కాంట్రాక్ట్ కాదు. భార్యలు ఇంట్లో పనిమనుషులు కారు అని న్యాయమూర్తులు జస్టిస్ భారతి డాంగ్రే, జస్టిస్ మంజుషా దేశ్‌పాండే ధర్మాసనం తేల్చిచెప్పింది.వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ (CA) అయిన ఒక వ్యక్తి, తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులకు విధేయత చూపడం లేదని, ఆమె ప్రవర్తన వల్ల తాను మానసిక వేదనకు గురవుతున్నానని పేర్కొంటూ 2004లో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై 2010లో ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేస్తూ, భార్యకు భరణం నిరాకరించింది. అయితే, దీనిని సవాలు చేస్తూ భార్య హైకోర్టును ఆశ్రయించగా, తాజాగా ఆమెకు అనుకూలంగా తీర్పు వెలువడింది. భార్య ఇంటి పనులు చేయకపోవడం అనేది మానసిక వేధింపుల కిందకు రాదని కోర్టు అభిప్రాయపడింది. ప్రతి వివాహంలోనూ ప్రారంభ దశలో చిన్నచిన్న సర్దుబాట్లు, మనస్పర్థలు ఉండటం సహజమని, వాటిని తీవ్రమైన క్రూరత్వంగా పరిగణించలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కేవలం వంట చేయడం, క్లీనింగ్ వంటి పనుల ఆధారంగా విడాకులు ఇవ్వడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేస్తూ, పాత విడాకుల

..మిగతా 4వ పేజీలో →



## తల వంచుకుంటున్న లంచావతారాలు

### రూ.2లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

**దశ, మేడ్చల్ :** రూ.2లక్షలు లంచం తీసుకుంటూ మరో అవినీతి అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మరో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలానికి చెందిన తహసీల్దార్ టి.సుచరిత రెండు లక్షల రూపాయలు తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ కేసులో ఆమె డ్రైవర్ వి నాగేష్‌ను కూడా అరెస్టు చేశారు. 30 ఎకరాల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తును ఆమోదించాలని తహసీల్దార్‌ను కోరగా అందుకు రూ.30లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో తహసీల్దార్ ప్రైవేట్ డ్రైవర్ నాగేష్‌కు రూ.2లక్షలు అందజేశాడు. డ్రైవర్ ఆ డబ్బును తహసీల్దార్ సుచరితకు ఇస్తుండగానే మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం డబ్బును పట్టుకున్నారు. ఆమెతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

### భూముల సర్వే కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్

**దశ, జోగులాంబ గద్వాల:** భూముల సర్వే చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి అధికారికంగా లబ్ధి చేకూర్చేందుకు లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను బాధితుడు ఆశ్రయించగా రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం మేరకు పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు.



## నిజమే మా రేవంత్ వడ్లు కొనట్లేదు

### ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ నిజమే

### ధాన్యం సేకరణ సరిగా లేదని రాజగోపాల్ రెడ్డి క్షమాపణ

**దశ, మునుగోడు:** ధాన్యం సేకరణపై చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో రైతులకు కేటా లు వాస్తవమే. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమైన విషయం వాస్తవం. మేం కూడా చింతిస్తున్నాం. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజమేనని అయన అన్నారు.



## వడ్లు కొనమనందుకు ఆర్టీసీ డ్రైవర్ పై వేటు

### ఆర్టీసీ ఆర్ ఎం పై ఎమ్మెల్యే గంగుల మండిపాటు

**దశ, జగిత్యాల:** వడ్లు కొనమని మంత్రికి చెప్పినందుకు ఒక ఆర్టీసీ డ్రైవర్ పై వేటు పడింది. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల గురించి జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధర్నాకు దిగారు. నిరసన తెలుపుతుంటే ముందు వడ్లు కొనండని చెప్పినందుకు

..మిగతా 4వ పేజీలో →

### ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికులపై
# ప్రత్యేక నిఘా

### శంషాబాద్ ఎయిర్ పోర్టు లో ఎబోలా స్కానింగ్ ఏర్పాట్లు




# అంతర్జాతీయ స్థాయిలో కోహెడలో పండ్ల మార్కెట్

### తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వ చర్యలు.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**జూన్ 3న సీఎం రేవంత్ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి దిశానిర్దేశం**



**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** అంతర్జాతీయ ప్రమాణాలతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడలోని సర్వే నెంబర్ 167లో పండ్ల మార్కెట్ ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలోనే అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగిందని.... అదే తరహాలో సకల హంగులతో పండ్ల మార్కెట్ నిర్మించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా,ఇదే ప్రాంతంలోసమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. వచ్చే 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పండ్ల మార్కెట్, సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది. ఇందుకోసం మార్కెట్ నిర్మించతలపెట్టిన ప్రాంతంలో అధికారయంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలైంది. సీఎం పర్యటన, మార్కెట్, రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన ఏర్పాట్లను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మల్కాజ్ గిరి సీపీ సుమతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి దిశానిర్దేశం చేసి, భద్రత చర్యలపై సీపీతో చర్చించారు. అలాగే, సీఎం పర్యటన, పనుల ప్రారంభోత్సవం

..మిగతా 4వ పేజీలో →

# యాదగిరిగుట్ట దేవస్థానంలో అక్రమాల ఆరోపణలు

❖ *దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు కళాకారులతో వినూత్న నిరసన..*




**దశ, ఓయూ :** హైదరాబాద్‌లోని బొగ్గులకుంట తిలక్‌నగర్ ప్రాంతంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట యాదగిరిగుట్టకు చెందిన స్థానిక వ్యాపారవేత్త అన్నల్దాస్ వెంకటేష్ వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన కొండపై కొనసాగుతున్న వర్తక సంఘం దుకాణాల వ్యవహారంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కళాకారులతో కలిసి ప్రదర్శన చేపట్టారు..కొండపై ఉన్న దుకాణాలను సంవత్సరాలుగా టెండర్లు నిర్వహించకుండా కేవలం రెన్యూవల్ పేరుతో కొనసాగిస్తున్నారని వెంకటేష్ ఆరోపించారు. దీనివల్ల దేవస్థాన ఆదాయానికి భారీ నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అధికారులు, కొందరు దుకాణాదారులు కుమ్మక్కై దేవస్థానాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ఒక సెల్‌ఫోన్ కౌంటర్ టెండర్ ద్వారానే రూ.2 కోట్ల ఆదాయం వస్తుండగా, 10 దుకాణాలకు కలిపి కేవలం రూ.1.50 కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు.దేవస్థానంలోని అన్నిదుకాణాలను పారదర్శకంగా టెండర్లు వేస్తే కోట్ల రూపాయల ఆదాయం ఆలయానికి సమకూరుతుందని ఆయన తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువకులు, చిన్న వ్యాపారులకు అవకాశాలు కల్పించకుండా కొందరు వ్యాపారులు ఎన్నో ఏళ్లుగా కొండపై తిష్టవేసుకుని దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వేషధారణలో ఉన్న కళాకారులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి, "దుష్ట శిక్షణ - శిష్ట రక్షణ" భావాన్ని ప్రతిబింబించేలా దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే దుకాణాలపై టెండర్ విధానం అమలు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని వెంకటేష్ డిమాండ్ చేశారు.



## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ..

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి) (ఎవో) రాష్ట్ర చైర్మన్ చింతపల్లి వెంకటేశ్వర్లుఅన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి (ఎవో ) జాతీయ మానవ హక్కుల మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరం ఉంటేనే బయటికి రావాలని తెలిపారు. ప్రజల హక్కులను కాపాడేందుకు నేషనల్ వుమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి (ఎవో) ముందు ఉంటుంది అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండడమే కాకుండా చట్టబద్ధంగా చట్ట పరిధిలో ప్రజల తరపున నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల రమేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రెటరీ బార్పటి సునీత, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్ప, కన్వీనర్ సారగండ్ల సైదులు, కోఆర్డినేటర్ కృష్ణ,చంద్రకళ పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి



❖ *ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మిక తనిఖీ*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రం గోండియా జిల్లా అర్జుని మోర్గావ్ మండలంలోని తిడ్కా గ్రామానికి చెందిన అంకుష్ వాల్మిక్ మాదవి (26)కు మూడున్నరేళ్ల క్రితం కుత్బుల్లాపూర్ రంగా రెడ్డి నగర్‌కు చెందిన మాధవి దివ్య (24)తో వివాహం జరిగింది. వీరికి ప్రస్తుతం 7 నెలల పాప ఉంది. వివాహం అనంతరం దంపతులు రంగా రెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. అయితే గత నెల రోజులుగా తీవ్ర ఎండల కారణంగా మాధవి దివ్య తన కుమార్తెతో కలిసి తల్లి ఇంటి వద్ద పంచశీల కాలనీలో ఉంటుండగా, అంకుష్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు.

గత 15 రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండటంతో భార్య పలుమార్లు పని చూసుకోవాలని సూచించినా వినిపించుకోలేదని తెలిపింది. ఈ నెల 22వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో అంకుష్ తన భార్యకు ఫోన్ చేసి వెంటనే ఇంటికి రావాలని, రాకపోతే చనిపోతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇలాంటి బెదిరింపులు అతను గతంలో కూడా పలుమార్లు చేసినట్లు తెలిపింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం భార్య ఇంటికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండగా భర్త కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పొరుగువారిని అడగగా రెండు రోజులుగా అతడిని చూడలేదని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12:25 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఫోన్ చేసి, ORR ఎగ్జిట్ నెంబర్ 11 సమీపంలోని టోల్ ప్లాజా కార్యాలయం వద్ద చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో అంకుష్ మృతదేహం లభించినట్లు సమాచారం అందించారు.

దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న భార్య తన భర్త మృతదేహాన్ని గుర్తించింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## క్రీడలకు యువత ప్రాధాన్యతనివ్వాలి




**దశ ఓయూ:** యువత మద్యం మత్తు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుడు, ఎస్ఎస్ఎస్ యువసేన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి అన్నారు. ప్రజ్ఞ గ్రూప్ సహకారంతో ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ లో గెలిచిన జట్టులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నమెంట్ కు సహకరించి క్రీడాకారులను ప్రోత్సహించిన నాచారం పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.టోర్నమెంట్ కు సహకరించిన కోచ్ లకు, క్రీడాకారులకు, వాలంటరీలకు సంతోష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



## గద్వాల డిపో బస్సులో చెలరేగిన మంటలు

**దశ, హైదరాబాద్:** ఎంజీబీఎస్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహబూబ్‌నగర్, గద్వాల వైపు వెళ్లే బస్సులు ఆగే ప్రాంతంలోని ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.భయంతో బస్సు దిగి ప్రయాణికులు పరుగులు తీశారు. అనంతరం ప్రయాణికులు బస్సు దిగి మంటలార్పే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న ఆర్టీసీ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నీళ్లతో ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

## హయత్‌నగర్‌లో మహిళ అదృశ్యం



**దశ, హయత్‌నగర్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. లక్ష్మారెడ్డిపాలెం శ్రీనగర్ కాలనీకి చెందిన కాశమోని బాలరాజ్ తన భార్య కాశమోని సబిత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాశమోని సబిత (37) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈ నెల 25వ తేదీ ఉదయం సుమారు 7 గంటలకు పెద్దఅంబర్‌పేట్‌లోని కార్యాలయానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె పనిచేసే కార్యాలయంలో విచారణ చేయగా, ఆ రోజు విధులకు హాజరు కాలేదని తెలిసింది. అనంతరం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త బాలరాజ్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాలికలకు సైకిళ్లు పంపిణీచేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహిళా సాధికారత కోసం మంగళవారం తిరుమలగిరి మండల సమైక్య ఆధ్వర్యంలో 'మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తిరుమలగిరి మహిళ సమైక్య ఆధ్వర్యంలో స్నేహ సంఘాల బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బాలికలకు క్రీడల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, సైక్లింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి, మక్కువ ఉన్న విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఈ సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. సైక్లింగ్ అనేది శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడుతుందని ఆయన అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహసిల్దార్ హరి ప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపిఎం లక్ష్మి సిసి నాగయ్య,ఎమ్మెస్ అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

## మధు హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

**దశ, సూర్యాపేట:** సూర్యాపేటలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ నేత చింతలపాటి మధు హత్య కేసులో ఐదుగురు అరెస్ట్ అయ్యారు. మిద్దె జీవన్, చింతా సైదులు, మేదరి ప్రసాద్, మిద్దె ఆనంద్, కక్కిరేణి భరత్ చంద్ లను పోలీసులు అరెస్టు చేసారు. 2007లో జరిగిన కాంగ్రెస్ నేత మిద్దె రవీందర్ హత్యకు ప్రతీకారంగానే మధు హత్య జరిగింది. తండ్రి హత్యకు ప్రతీకారంగా రవీందర్ కొడుకు మిద్దె జీవన్ మధును హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.


## బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం

❖ *జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య*




**దశ, మంచిర్యాల:** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై డీసీపీ భాస్కర్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మంచిర్యాల జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని అధికారులను సూచించారు.బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత సమాజంలో అవగాహన పెంపొందించి బాల్య వివాహాలను అరికట్టేందుకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల దుష్ప్రభావాలు, చట్టపరమైన అంశాలు, నివారణ చర్యలపై రూపొందించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఏసీపీలు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

03
జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
బుధవారం
27-05-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




## PSARA యాక్ట్ ఉల్లంఘించిన సెక్యూరిటీ ఏజెన్సీ లపై కేసు నమోదు



**దశ, ఖమ్మం :** ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సెక్యూరిటీ ఏజెన్సీ లపై తనిఖీ నిర్వహించి పసారా యాక్ట్ ప్రకారంగా లైసెన్సులు లేకుండా, ప్రైవేటు ఏజెన్సీలను నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసుల నమోదుకు చర్యలు చేపట్టినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన పోలీస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సెక్యూరిటీ ఏజెన్సీల వివరాలు వెల్లడించారు. నిర్వహిస్తున్న 1)వీరెల్లి నవనీత్ చౌదరి సెక్యూరిటీ & హౌస్ కీపింగ్, మ్యాన్ పవర్ సర్వీసెస్ వీరెల్లి శ్రీనివాసరావు, 2) ASP సెక్యూరిటీ మరియు హౌస్ కీపింగ్ సర్వీసెస్ P. సుభాష్, 3) MR సెక్యూరిటీ హౌస్, కీపింగ్ సర్వీసెస్, గొల్లమందల మంగయ్య, సమైక్య హౌస్ కీపింగ్ సర్వీసెస్ యజమాని మందాడి సామ్రాజ్యం. వీరందరూ కూడా గత కొంతకాలం నుండి PSARA యాక్ట్ ఉత్తర్వులను ఉల్లంఘించి కొంతమంది వ్యక్తులకు ప్రైవేట్ గా సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు కల్పిస్తున్నందున వీరందరిపై కేసు నమోదుకు చర్యలు తీసుకొనబడినది. ఇలాంటి సెక్యూరిటీ ఏజెన్సీలు ఎవరైనా PSARA యాక్ట్ ద్వారా లైసెన్సులు పొందకుండా నిర్వహిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ హెచ్చరించారు.

## నేపాలి జాతీయుల వివరాలు అందించాలి

❖ *భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు*



**దశ, భద్రాచలం:** భద్రాచలం పట్టణ భద్రత దృష్ట్యా భద్రాచలం పట్టణంలో నివసిస్తున్న నేపాల్ దేశానికి చెందిన వ్యక్తుల పూర్తి వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విదేశీ జాతీయుల వివరాల సేకరణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.హోటళ్లు, లాడ్జ్లు, షాపులు, అపార్ట్మెంట్లు లేదా గుర్ఖాలుగా విధులు నిర్వహిస్తున్న నేపాలి జాతీయుల పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషను అందించాలని సూచించారు. ఈ ప్రక్రియలో మీడియా ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, లాడ్జ్ యజమానులు సహకరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా భద్రతా అప్రమత్తత కొనసాగుతున్న నేపథ్యంలో విదేశీ పౌరుల ధృవీకరణ ప్రక్రియలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా విదేశీ జాతీయుల సమాచారం వెంటనే పోలీసులకు అందిస్తే భద్రతా పరిరక్షణకు తోడ్పడినవారవుతారని పట్టణ సీఐ నాగరాజు పేర్కొన్నారు. భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ SHO 8712682105, భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ 8712682106 ఫోన్ నంబర్లుకు సమాచారం అందించవలసిన సమాచారం అందించాలని పట్టణ సీఐ నాగరాజు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు మరణం బాధాకరం

❖ *మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్*

**దశ, మునగాల:** అనుకోని రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తండ్రి కూతురు ఒకేసారి అకాలమరణం చెందటం అత్యంత బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గత సోమవారం మండల పరిధిలోని మొద్దుల చెరువు స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరాంపురం గ్రామానికి చెందిన కీత రాజయ్య మరియు ఆయన కుమార్తె సునీత మృతి చెందిన సంఘటనలో మంగళవారం వెంకటరాంపురం గ్రామంలో నిర్వహించిన రాజయ్య, సునీత ల దహన సంస్కార కార్యక్రమంలో మల్లయ్య యాదవ్ పాల్గొని తండ్రి కూతురు మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గ్రామ దీపికల సమస్యలను పరిష్కరించాలి

❖ *బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు*




**దశ, వైరా:** గ్రామ అభివృద్ధిలో పాటుపడే' గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న గ్రామీణ మహిళల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న మహిళలన చైతన్యవంతం చేసే డ్వాక్రా సంఘాల గ్రామ దీపికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజుల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న దీక్షాశివరాన్ని ఏన్కూర్ మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సందర్శించి వారి సమ్మెకు సంఘీభావం ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న గ్రామ దీపికల పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యపు వైఖరిని అవలంబిస్తుందని వేతనాలు పెంచకపోవడంతో పాటు శ్రమదోపిడికి గురిచేస్తున్నారని వారి యొక్క శ్రమని దోసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేలాదిమంది గ్రామ దీపికలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవటం వారి శ్రమని గుర్తించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆవేదన వ్యక్తం చేశారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచాలని హెల్త్ పాలసీలు అమలు చేయాలని సీనియారిటీ ప్రాతిపదిక మీద సీనియర్ గ్రామ దీపికలను సీసీలుగా గుర్తించాలని హెచ్ఆర్సీ పాలసీని అమలు చేయాలని గౌరవ వేతనం కాకుండా వారికి కనీస వేతనం 20000 మంజూరు చేయాలని గ్రామ దీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ దీపికల యొక్క సమస్యలు పరిష్కరించేంత వరకు తమ న్యాయమైన డిమాండ్లను అమలు అయ్యేంతవరకు ఉద్యమించాలని ఆ ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతును సంఘీభావాన్ని తెలియజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారులు గిద్దగిరి సత్యనారాయణ, ఇంజం దేవదాసు, భూక్యా ధర్మ నాయక్, భూక్యా వినోద్ కుమార్, షేక్ బాజీ, గూగులోత్ మజిలాల్, రాచబంటి వీరభద్రం, కడియాల సుధాకర్, బానోత్ రమేష్ మరియు తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో మంటలు పెట్టొద్దు

❖ *వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు*



**దశ, పినపాక:** పంట పొలాల్లో మంటలు పెట్టడం వల్ల నష్టాలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని పినపాక మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పొలాల్లో వ్యర్థాలను కాల్చడం వల్ల భూమి సారం కోల్పోవడంతో పాటు పంటకు మేలుచేసే ప్రయోజనకరమైన కీటకాలు మృతి చెందుతాయని తెలిపారు. వాడుక భాషలో ఎరగడ గా పిలిచే ఈ ప్రక్రియ వల్ల గాలి కలుషితం అవడంతో పాటు ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తెలిపారు.భూ సారం తగ్గి పోషక విలువలు కోల్పోవడం వల్ల రైతులకు రసాయనిక ఎరువుల వినియోగం అధిక మవుతుందని తద్వారా సాగు వ్యయం పెరిగి రైతులు నష్టపోతారని అన్నారు. పొలాల్లో వ్యర్థాలను కాల్చడం వల్ల మంటలు పక్కనే ఉన్న పొలాలకు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నదన్నారు. వ్యర్థాలను భూమిలో కలియ దున్నడం వలన అవి ఎరువుగా మారి భూమిని సారవంతంగా మారుస్తాయని తెలియజేశారు. కానిపక్షంలో వ్యర్థాలను గొయ్యి తవ్వి అందులో వేస్తే అవి కొన్ని రోజులకు ఎరువుగా మారతాయని, బయో వ్యర్థాలను బయోగ్యాస్ తయారీలో కూడా ఉపయోగించవచ్చునని తెలిపారు.అలాగే తొలకరి వర్షాలు కురిసే సమయంలో జీలుగ,పిల్లిపిసర వంటి పంటలను సాగుచేసి పచ్చిరొట్ట ఎరువులుగా భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరిగి మామూలు కంటే అధిక దిగుబడి వస్తుందని అన్నారు.కావున రైతులందరూ పొలాల్లోని వ్యర్థాలను కాల్చడం మాని పచ్చి రొట్ట ఎరువులు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచేందుకు ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు.




## అంబేద్కర్ విగ్రహం తొలగింపుపై దళిత సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

**దశ, అశ్వాపురం:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి ఆర్ అండ్ బి అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుండి గౌతమి నగర్ కాలనీ గేటు వరకు భారీ సంఖ్యలో దళిత సంఘాల నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిన అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించడం సరైన చర్య కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విగ్రహాన్ని తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీ మొత్తం "జై భీమ్" నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులకు రక్షణ కల్పించాలి



❖ *AITUC బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్*

**దశ, మణుగూరు:** AITUC ఆధ్వర్యంలో తీవ్ర వేసవి పరిస్థితుల కారణంగా యాజమాన్యం వెంటనే రక్షణ చర్య తీసుకోవాల్సిన కోరుతూ PK OC2 మణుగూరు మేనేజర్‌కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ వేసవిలో ఎండల దాటికి కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పని ప్రదేశాలలో రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం తీవ్ర ఎండలు కారణంగా రెడ్ అలర్ట్ ప్రకటించి రక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పినా కంపెనీ పట్టించుకోవడం లేదన్నారు.

వెంటనే మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్ర వేసవి దృష్ట్యా పని గంటల సడ లింపుఇవ్వాలని బ్లాస్టింగ్ ఆపరేషన్ మధ్యాహ్నం 12 గంటల కల్లా పూర్తి చేయాలని మైన్ల వద్ద కాంపౌండర్ లేక ఫస్ట్ ఐడీర్ నియమించాలని. మంచినీటి సరఫరా, కూల్ వాటర్, మరియు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు వర్కింగ్ ప్లేస్ లో కార్మికులకు అందుబాటులో ఉంచాలని, డ్యూటీ సమయంలో ఎండ ప్రభావంతో అలసిపోతున్న కార్మికులకు రెస్ట్ బ్రేక్స్ ఇవ్వాలని, షెడ్లు, రెస్ట్ షెల్టర్లు, మరియు ఇతర వేసవి రక్షణ చర్యలు అవసరమైన చోట ఏర్పాటు చేయాలని, డస్ట్ కారణంగా కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని డస్ట్ నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ AITUC గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్ గారు కార్మికుల రక్షణ మరియు ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని, షిఫ్ట్ టైమింగ్స్ సడలించాలని సి&ఎండి గారికి లెటర్ అందజేయడం జరిగిందని అన్నారు.

కావున యాజమాన్యం వెంటనే కార్మికుల ఆరోగ్య పరిస్థితులు, రక్షణ ను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్ రావు, ఆఫీస్ బేరర్ బి.సురేందర్, సుదీప్త్, జానకి, ప్రసాద్, రవికుమార్, సురేష్, వెంకటేశ్వర్లు, బొక్క శ్రీనివాస్, హుస్సేన్, అజీజ్, శోభనబాబు తదితరులు పాల్గొన్నారు.

## మేము సైతం మిత్రమండలి ట్రస్ట్ వితరణ

**దశ, మణుగూరు:** మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా.. మణుగూరు ప్రాంతానికి చెందిన మచ్చ లక్ష్మణ్ (0) సంవత్సరాలు వడదెబ్బతో మంగళవారం మరణించారు. వీరిది నిరుపేద కుటుంబం అని తెలిసి మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ స్పందించి ట్రస్ట్ ద్వారా లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు రూ.3 వేల రూపాయలు దహన సంస్కరాల కోసం అందచెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాస్ రావు, అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, ట్రస్ట్ సభ్యులు P.జగన్ మోహన్, చిందుకూరి రామారావు, దేరంగుల నరసింహ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాలకు కార్పొరేట్ స్థాయి బలం



**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. మహిళలు ప్రస్తుతం పెద్ద ఎత్తున చైన్ సూపర్ మార్కెట్లలో కొనుగోళ్లు చేస్తున్న నేపథ్యంలో, నాణ్యమైన నిత్యావసర వస్తువులు లభించే విశ్వసనీయ గుర్తింపుగా మహిళా శక్తి బజార్లను తీర్చిదిద్దాలని సీఎం ఆకాంక్షించారు. దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా ఇవి ఎదగాలని ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇక ప్రతి మండలంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, సరుకు రవాణా కేంద్రాలు, భారీ గిడ్డంగులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంటామని, బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాల అనుసంధానం కల్పిస్తామని స్పష్టం చేశారు. కొంతమంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వ వ్యవస్థను మోసం చేస్తున్నారని పేర్కొన్న సీఎం, మహిళలకు బాధ్యతలు అప్పగిస్తే జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో మండలాల వారీగా పెద్ద గిడ్డంగులు నిర్మించి ధాన్యాన్ని అక్కడే భద్రపరచే విధానం తీసుకురావాలని, మిల్లర్లు మహిళా సంఘాల నుంచే ధాన్యం సేకరించే వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని సీఎం అన్నారు. మహిళలను స్వశక్తిపై నిలబెట్టేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలకు అందించనున్న ఇందిరమ్మ చీరల నమూనాలను కూడా సీఎం ఈ సందర్భంగా విడుదల చేశారు.

2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావిస్తూ రాష్ట్ర మంత్రిమండలి పనిచేస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.






### ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికులపై

# ప్రత్యేక నిఘా

## శంషాబాద్ ఎయిర్ పోర్టు లో ఎబోలా స్కానింగ్ ఏర్పాట్లు

**దశ, హైదరాబాద్:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వ్యాధి స్కానింగ్ ఏర్పాట్లు చేసారు. ఆఫ్రికా నుంచి శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు వస్తున్న ప్రయాణికులను స్కాన్ చేసి వ్యాధిని ఎయిర్పోర్ట్ అధికారులు గుర్తిస్తున్నారు. ఎబోల వ్యాధి నిర్ధారణ అయితే క్వారంటైన్ కు పంపిస్తున్నారు. ఆఫ్రికా దేశంలో విస్తరిస్తున్న యబోలా కారణంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వివిధ దేశాల నుంచి శంషాబాద్ కు వచ్చే ప్రయాణికులకు ఎబోలా స్క్రీనింగ్ చేస్తున్నారు,

**ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా: దామోదర రాజనర్సింహ**

ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కి పంపామన్నారు.

విదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు.

### ఇద్దరు మావోయిస్టుల

# లొంగుబాటు

**దశ, హైదరాబాద్:** ఇద్దరు సిపిఐ (మావోయిస్టు) అత్యంత సీనియర్ నేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు (CCM) మరియు బీహార్‌జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (BJSAC) కార్యదర్శి పసునూరి నరహరి @ విశ్వనాథ్ @ సలై దా, మరియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు (SCM), మేదర దానమ్మ @ లత @ పూనం @ జోబా నిషేధిత సిపిఐ (మావోయిస్టు) పార్టీని వీడి తెలంగాణ పోలీసుల ఎదుట జన జీవన స్రవంతిలో కలిసారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఎదుట, కేంద్ర కమిటీ సభ్యుడు (CCM) , బీహార్‌జార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ (BJSAC) కార్యదర్శి న పసునూరి నరహరి @ విశ్వనాథ్ @ సలై దా; మరియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు (SCM) మేదర దానమ్మ @ లత @ పూనమ్ @ జోబా లు జన జీవన స్రవంతిలో చేరడంతో, సిపిఐ (మావోయిస్టు) పార్టీకి ఒక పెద్ద ఎదురుదెబ్బ గా పోలీసులు భావిస్తున్నారు.

# రాజాసింగ్‌ను టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు



**దశ, హైదరాబాద్:** సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే.తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు.రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. ఇవాళ రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు.ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు. ఈ సైబర్ నేరగాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# "వాహన్" యాప్ తిప్పలు

## .. పెరిగిపోతున్న దళారుల రాజ్యం

### నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు గంటల తరబడి

**దశ, హైదరాబాద్:** 'రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా డిజిటల్ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రీకృత 'వాహన్' పోర్టల్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు సకాలంలో అందకపోవడంతో సామాన్యులు విసిగిపోతున్నారు. ఇదే తరుణాన్ని ఆసరాగా చేసుకుని దళారులు (ఏజెంట్లు) వేలల్లో డబ్బులు తీసుకుంటూ సామాన్యులను దోచుకుంటున్నారు. లర్నింగ్ లైసెన్స్ , డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ (రెక్టిఫికేషన్/రిన్యూవల్), చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ వంటి విభిన్న రకాల సేవల కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల ఈ విధానంలోకి మారినప్పటికీ, అప్పటి నుంచి సాంకేతిక లోపాలు నిత్యకృత్యంగా మారాయి. గతంలో నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు అరగంట దాటినా కావడం లేదు. ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మొబైల్ నంబర్ ఆథెంటికేషన్ కావడం లేదు. సరైన సైజులో ఫోటోలు, సంతకం, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ వెబ్‌సైట్‌లో లోపాలు తలెత్తుతున్నాయి.సొంతంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే వెబ్‌సైట్ పనిచేయకపోవడం, అదే రవాణా కార్యాలయాల్లోని ఏజెంట్లను ఆశ్రయిస్తే వెంటనే స్లాట్ బుకింగ్ అయిపోతుండటం గమనార్హం. వెబ్‌సైట్‌లో ప్రతి సేవకు ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ రుసుము ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దళారులు చెప్పిందే వేదంగా మారుతోంది. ఆన్‌లైన్ ఫీజుతో సంబంధం లేకుండా ఒక్కో సేవకు ఒక్కో రకమైన ధర నిర్ణయించి వాహనదారుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నారు."నా కుమారుడికి లైసెన్స్ కోసం సొంతంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేయడానికి ఎంత ప్రయత్నించినా కాలేదు. కానీ స్థానిక ఆర్టీఓ ఆఫీసులో ఒక ఏజెంట్‌ను సంప్రదించగానే వెంటనే స్లాట్ బుక్ అయింది. ఇందుకోసం అతనికి రూ. 3 వేలు ఇవ్వాల్సి వచ్చింది. రవాణా శాఖ ఆఫీసుల చుట్టూ తిరగకుండా సొంతంగా చేసుకోవచ్చని చెబుతున్నా, ఆచరణలో మాత్రం దళారులను ఆశ్రయించనిదే పని కావడం లేదు అని"ఆసిఫ్ నగర్‌కు చెందిన ఒక వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు.పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు లేవని రవాణా శాఖ అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జాతీయ సంస్థ 'ఎన్ఐసీ' (NIC) నుంచి అవసరమైన టెక్నికల్ సపోర్ట్ తీసుకుంటున్నామని, 'వాహన్' పోర్టల్‌లో మరిన్ని కొత్త మాడ్యూళ్లను దశలవారీగా ప్రవేశపెడతామని అధికారులు పేర్కొంటున్నారు.



### 150 మిలియన్+ వ్యూస్ తో ది ప్యారడైజ్

# 'ఆయా షేర్' సాంగ్ రికార్డ్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో భారీ విజయాన్ని అందుకున్న 'దసరా' తర్వాత తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్ర సంగీత ప్రయాణానికి శ్రీకారం చుట్టిన తొలి సింగిల్ 'ఆయా షేర్' విడుదలైనప్పటి నుంచి సంచలనాలు సృష్టిస్తోంది..తాజాగా ఈ పాట తెలుగు వెర్షన్‌లోనే 150 మిలియన్ వ్యూస్, 1.6 మిలియన్ లైక్స్ సాధించి నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియా, కాలేజ్ ఫెస్ట్స్, పబ్లిక్ ఈవెంట్స్, డ్యాన్స్ స్టేజీలను షేక్ చేస్తూ ఈ పాట ఒక కల్చరల్ ఫెనామెనన్‌గా మారింది. శ్రీకాంత్ ఓదెల సృష్టించిన రఫ్ అండ్ రస్టిక్ ప్రపంచం, నాని పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఎర్తీ విజువల్స్, రగ్గడ్ టోన్, నాని మాస్ డ్యాన్స్ మూవ్స్ పాట ఇంపాక్ట్‌ని మరింత పెంచాయి. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జిటిక్ బీట్స్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లగా, కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# భార్యలు ఇంట్లో పనిమనుషులు కాదు

**మొదటి పేజీ తరువాయి**

ఉత్తర్వులను రద్దు చేసింది.ఇక భరణం విషయంలో కూడా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సదరు భార్య గతంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ క్లాసుల కోసం ప్రకటన ఇచ్చిందని, అది ఆమెకు స్థిరమైన ఆదాయం చూపుతుందని ఫ్యామిలీ కోర్టు భరణాన్ని నిరాకరించింది. దీనిని తప్పుపట్టిన హైకోర్టు.. కేవలం ఒక ప్రకటన లేదా చిన్నపాటి నైపుణ్యం ఉండటం వల్ల అది స్థిరమైన జీవనోపాధి కిందకు రాదని పేర్కొంది. భర్తకు ఉన్న ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి, ఆమెకు నెలకు రూ. 10,000 భరణం, నివాసం కోసం మరో రూ. 10,000 చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు భవిష్యత్తులో విడాకుల కేసులపై పెద్ద ప్రభావం చూపనుంది. ముఖ్యంగా సామాజికంగా భార్యలపై ఉండే ఇంటి పని' ఒత్తిడిని చట్టపరమైన బాధ్యతగా చూడకూడదనే స్పష్టతనిచ్చింది. కేవలం మూస పద్ధతులతో భార్యపై ఆరోపణలు చేసి విడాకులు పొందడం ఇకపై అంత సులభం కాదని ఈ తీర్పుతో అర్థమవుతోంది.



# అంతర్జాతీయ స్థాయిలో కోహెడలో పండ్ల మార్కెట్

**మొదటి పేజీ తరువాయి**

గురించి కలెక్టర్ తో చర్చించారు. గడ్డి అన్నారం నుంచి తరలించి, ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న మార్కెట్ ను ముఖ్యమంత్రి సూచనల మేరకు అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేలా నిర్ణయం జరిగిందని చెప్పారు. ఈ మేరకు కోహెడలోని ప్రభుత్వ భూములను గుర్తించి, మార్కెటింగ్ శాఖకు అప్పగించినట్లు చెప్పారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తైతే అటు పండ్ల విక్రయదారులు, వ్యాపారులు, వినియోగదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మధ్యదళారీల బెడద లేకుండా ప్రజలే నేరుగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు జరుగుతాయన్నారు. అదేవిధంగా, మరో 4ఎకరాల్లో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం జరగనున్నట్లు చెప్పారు. మౌలిక వసతులు, సకల హంగులతో ఈ కార్యాలయాలు రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగిసేలా అధికారులు దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంత రెడ్డి, డీసీపీ అనురాధ, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డీసీపీ నరసింహ రెడ్డి, ఏసీపీ కాశిరెడ్డి, సీఐ అశోక్ రెడ్డి, ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ ఎస్ఈ లక్ష్మణ్, డీఈ రవీందర్, డీడీ ప్రసాద్ రావు, జేడీ మల్లేశం, మార్కెట్ సెక్రటరీ ఎల్. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ బాస్కరాచారి, సభ్యులు జైపాల్ రెడ్డి, మధుసూదన్ రావు, అంజయ్య, రఘుపతి రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, నవరాజ్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# వడ్లు కొనమనందుకు ఆర్టీసీ డ్రైవర్ పై వేటు

**మొదటి పేజీ తరువాయి**

జగిత్యాల డిపోకు చెందిన బస్ డ్రైవర్ పై వేటు వేసి డ్యూటీకి రావద్దని రిమూవల్ లెటర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఇచ్చారు. అయితే తాను ఏ రాజకీయ పార్టీని లేదా నాయకుడిని విమర్శించలేదని, రైతుల గురించి మాత్రమే మాట్లాడానని డ్రైవర్ అశోక్ అంటున్నాడు. ఆర్ఎం నుంచి రిమూవల్ లెటర్ వచ్చిందని, డ్యూటీకి రావద్దని సూచించినట్లు వెల్లడించాడు.

**ఆర్టీసీ ఆర్ ఎం పై ఎమ్మెల్యే గంగుల మండిపాటు.**

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల ఆర్టీసీ ఆర్ ఎం పై ఆగ్రహం వ్యక్తం చేసారు. నిన్న ఆర్టీసీ డ్రైవర్ ను సస్పెండ్ చేసిన విషయం పై ఆగ్రహం వ్యక్తం చేసారు. ధాన్యం కొనుగోలు చేయాలని అన్న డ్రైవర్ ను సస్పెండ్ చేయడం ఏంటి? డ్రైవర్ ఓ పార్టీ కి సంబంధించిన వ్యక్తి కాదని అన్నారు. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ ను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.



# ఎయిరిండియా బస్సులో మంటలు

**దశ, పెద్ద అంబర్ పేట :** రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్ పేట వద్ద ఓ ఆర్ ఆర్ సర్వీసురోడ్డులో ఎయిరిండియాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు దగ్ధమైంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వస్తుండగా బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయని గుర్తించిన సిబ్బంది అప్రమత్తమై దిగిపోయారు. ఘటనా స్థలికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్రమత్తంగా ఉండటం వల్ల ప్రాణనష్టం తప్పిందని పోలీసులు తెలిపారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com